క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

అడ్డగుట్ట: డివిజన్‌లోని మార్కండేయ సహిత శివ పంచాయతన దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని మరుసటి రోజు సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆలయంలోని కాశీ విశ్వేశ్వర స్వామి, మార్కండేయ స్వామికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ నెల 19న మాస శివరాత్రి ప్రదోషకాలంలో సాయంత్రం ఆలయంలో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధి బొమ్మ నరేంద్ర తెలిపారు.

వినతి



రాంచందర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

లాలాపేట: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ సభ్యులు సోమవారం తార్నాకలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్‌రావును కలిసారు. బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీం కోర్టులో తెలంగాణ ప్రభుత్వంలోని కొందరు ఎమ్మెల్యేలు పిటిషన్ వేసిన నేపథ్యంలో సుప్రీం కోర్టు బెంచ్ కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు అభిప్రాయాలను చెప్పాలని కోరింది. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బంజారా వర్గాలకు నష్టం జరగకుండా చూడాలని బంజారా నేతలు రామ్‌చందర్‌రావును కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ నాయకులు మాజీమంత్రి రవీందర్ నాయక్, మాజీ పార్లమెంట్ సభ్యులు ప్రొ. సితారామ్ నాయక్, మాజీ కేంద్రమంత్రి అమర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక పట్ల అనుచిత ప్రవర్తన

వ్యక్తికి మూడేళ్ల జైలు

సనత్‌నగర్: బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ కూకట్‌పల్లి ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ అండ్ ఫోక్సో కోర్టు జడ్జి ఎస్.అమరావతి తీర్పు వెలువరించారు. సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. బోరబండ వివేకానందనగర్‌కు చెందిన లింగంపల్లి అనిల్‌కుమార్ (42) 2020లో స్థానికంగా ఉన్న ఓ మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా, అనుచితంగా ప్రవర్తించగా బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అన్ని ఆధారాలు సేకరించిన పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.

ఆర్టీసీ వర్క్‌షాపు యథావిధిగా కొనసాగాలి



సుద్దాల సురేష్

లాలాపేట: రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసి కార్మికులకు రావాల్సిన 2017–2021 పేస్కేల్ బకాయిలు, అలవెన్సులతో సహా చెల్లించాలని ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ డిమాండ్ చేస్తూ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పదవీ విరమణ పొందిన కార్మికులకు సెప్టెంబర్ 2025 వరకు అన్ని విధాలుగా వారికి రావాల్సిన బెనిఫిట్స్, బకాయిలను క్లియర్ చేయాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. ప్రధానంగా ఉప్పల్ వర్క్ షాపును రెండు ముక్కలుగా చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని ఈ విషయమై మేనేజ్మెంట్ ఇచ్చిన సర్క్యూలర్‌ను రద్దు చేయాలని కోరారు. ఉప్పల్ వర్క్ షాపు కార్మికులను కరీంనగర్‌కు ట్రాన్స్‌ఫర్ చేయడంతో వారి కుటుంబాలు అనేక రకాలుగా ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు.

గంజాయి మత్తులో యువకుల వీరంగం

రాంగోపాల్‌పేట్: గంజాయి మత్తులో నలుగురు యువకులు వీరంగం సృష్టించిన ఘటన గోపాల్‌పురం పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఇదే ప్రాంతానికి చెందిన సాయి అనే వ్యక్తి తన ముగ్గురు స్నేహితులతో కలిసి గంజాయి తాగారు. మత్తులో ఉన్న ఈ నలుగురు దారివెంట వెళ్తున్న ఓ యువకుడిపై దాడికి పాల్పడ్డారు. ఆ తర్వాత గండి మైసమ్మ దేవాలయం పక్కనే ఉన్న హోటల్ వద్దకు వచ్చి హోటల్‌లో పనిచేస్తున్న ఓ యువకుడితో పాటు, మరో యువకుడిపై దాడి చేసి గాయపరిచారు. చుట్టుపక్కల వారు అడ్డుకునేందుకు యత్నిస్తుండగా వారిని భయభ్రాంతులకు గురి చేశారు. కొంతమంది కలిసి వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మరో ఇద్దరు పారిపోయారు.

రోడ్డుపై స్తంభం.. ప్రమాదాలకు నిలయం

- నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



రోడ్డుకు ఆనుకుని నిర్మించిన పెట్రోల్ బంకు డివైజర్



ఏషియన్ మైన్స్ ఎదురుగా రోడ్డుపై విద్యుత్తు స్తంభం

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బోయిగూడ ప్రధాన రహదారిలో విద్యుత్తు స్తంభం జనానికి గుది బండగా మారింది. ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం...పెట్రోల్ బంకు నిర్వాహకుల నిర్మాణాలు ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. బోయిగూడ ఏషియన్ మైన్స్ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకు ముందు విద్యుత్తు స్తంభం కారణంగా రాకపాకలు సాగించే వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బోయిగూడ వై జంక్షన్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఒలిఫెంటా బ్రిడ్జి వైపు వెళ్లే రహదారిలోని పెట్రోల్ బంకు వద్ద విద్యుత్తు స్తంభంతో వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు.

కుంచించుపోతున్న రోడ్డు

వాహనాల రద్దీతో ఈ రహదారి ఎప్పుడు సండిగా ఉంటుంది. నిత్యం వేలాది వాహనాలు ఈ రహదారి గుండా రాకపాకలు సాగిస్తుంటారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఇతరత్రా ప్రాంతాలకు అదే విధంగా సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలంటే అనేక మంది ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై విద్యుత్తు స్తంభం కారణంగా రాత్రి వేళల్లో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. స్తంభానికి సమీపంలోనే చౌరస్తా ట్రాఫిక్ సిగ్నల్స్ పడినప్పుడు ఈ ప్రాంతంలో రోడ్డుపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతాయి. పలు సందర్భాల్లో ట్రాఫిక్ సిగ్నల్ పడినప్పుడు వేగంగా వెళ్లే వాహనచోదకులు విద్యుత్తు స్తంభాన్ని చూసుకోలేక ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో చీకట్లో విద్యుత్తు స్తంభం కనిపించక అనేక మంది స్తంభానికి ఢీకొని ప్రమాదాలకు గురవుతుండటం నిత్యకృత్యంగా మారింది. అసలే ఇరుకైన రహదారి దానికి తోడు విద్యుత్తు స్తంభం వల్ల ఈ రహదారి కుంచించుపాయింది.

అధికారులు చర్యలు తీసుకోవాలి..

ఇటీవల జీహెచ్‌ఎంసీలో జరిగిన వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయ కమిటీ సమావేశంలో కూడా ట్రాఫిక్ పోలీసులు విద్యుత్తు స్తంభం వల్ల కలుగుతున్న ట్రాఫిక్ అంతరాయం..ప్రమాదాల గురించి ప్రస్తావించినట్లు సమాచారం. అదే విధంగా పక్కనే ఉన్న పెట్రోల్ బంకు నిర్వాహకులు చిన్న డివైడర్ ఏర్పాటు చేశారు. దీని వల్ల కూడా ట్రాఫిక్‌కు అంతరాయంతో పాటు వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని రోడ్డుపై ఉన్న విద్యుత్తు స్తంభంతో పాటు డివైడర్‌ను కూడా తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

హైడ్రా అధికారులూ.. చెరువును అభివృద్ధి చేయరూ?



చెరువు ఎఫ్‌టీఎల్ నుంచి అనధికారింగా కొనసాగుతున్న మట్టిరోడ్డు

లాలాపేట: తార్నాకలోని ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నుంచి భారీ వాహనాల రాకపోకలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు. మే నెలలో హైడ్రా అధికారులు చెరువు ప్రక్షాళన కోసం సర్వే చేసి దాదాపు 6 ఎకరాల విస్తీర్ణంలో చెరువు, ఎఫ్‌టీఎల్‌తో పాటు 9 మీటర్ల బఫర్ జోన్లను గుర్తించి 14 చోట్ల మార్కింగ్ చేశారు. అయినప్పటికీ ఓ బహుళ అంతస్తు నిర్మాణదారుడు చెరువు ఎఫ్‌టీఎల్ నుంచి అనధికారింగా రోడ్డును వాడుకుంటున్నారు. చెరువు భూముల్లో మట్టిపోస్తూ తరచూ రోడ్డును చదును చేస్తున్నాడు. అపార్టుమెంట్ నిర్మాణానికి కావాల్సిన సామగ్రిని ఈ మట్టి రోడ్డు గుండానే తరలించడం, వ్యర్థాలను బయటకి తరలిస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తార్నాకవాసులు పేర్కొంటున్నారు.

చెరువు భూమి కబ్జా?

తార్నాక సండే మార్కెట్ ప్రధాన రోడ్డు నుంచి చెరువు భూముల్లోకి రాకపోకలు సాగించకుండా చర్యలు తీసుకోవాలనీ తార్నాకవాసులు కోరుతున్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా వాడుకుంటున్న రోడ్డును నూతనంగా చేపడుతున్న బహుళ అంతస్తుల సముదాయానికి రానున్న రోజుల్లో అధికారిక రోడ్డుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పాటుగా చెరువు భూముల్లో భవన నిర్మాణ వ్యర్థాలను వేయడం, చెరువు భూములను కబ్జా చేస్తున్నారని స్థానికులు వెల్లడిస్తున్నారు. రాత్రి సమయంలో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తున్నారని వీటన్నింటికి అడ్డుకట్ట వేయాలంటే నాగార్జునగర్ కమ్యునిటీ హాల్ ఎదురుగా ఉన్న మట్టి రోడ్డు వద్ద రాకపోకలు నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికే 'కంటోన్మెంట్ వాణి'



కంటోన్మెంట్ వాణి నిర్వహించే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా కంటోన్మెంట్ వాణి కార్యక్రమం చేపడుతున్నామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. సెప్టెంబర్ 10న తొలి విడతగా ఒకటో వార్డు పరిధిలోని బోయిన్‌పల్లిలోని ప్లేగ్రౌండ్ ఆవరణలో ఉదయం 11 గంటలకు కంటోన్మెంట్ వాణి కార్యక్రమం నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి ప్లేగ్రౌండ్‌ను పరిశీలించి మాట్లాడారు. అధికారులు, శాఖల మధ్య సమన్వయ లేమి కారణంగానే పలు సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతుందన్నారు. పికెట్‌లోని తన క్యాంపు కార్యాలయానికి వచ్చే ప్రజలు తెలిపే సమస్యలను సంబంధిత అధికారులకు చెప్పినా పదేపదే వాటిపై దృష్టి సారించాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని శాఖల అధికారులను ఒకే వేదిక పైకి తీసుకొచ్చి, ప్రజల నుంచి సమస్యలు స్వీకరించేందుకు ప్రజా వాణి నిర్వహిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలను గతంలో తన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీగణేశ్ ఫౌండేషన్ ప్రతినిధులత ద్వారా క్రోడీకరిస్తామన్నారు. చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తామని మిగతా వాటిపై శ్రీగణేశ్ ఫౌండేషన్‌తో పాటు వార్డుల వారీగా స్థానిక నేతల ద్వారా ఫాలోఅప్ చేయిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జంపన ప్రతాప్, ముప్పిడి మధుకర్, వేణుగోపాల్ రెడ్డి, రాజేశ్ యాదవ్, సంకి రవీందర్, సదానంద్, రామ్ కుమార్, నాగినేని సరిత, ఉత్తరయ్య పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: సంజీవయ్య పార్క్–జేమ్స్‌స్ట్రీట్ స్టేషన్ల మధ్యగల రైల్వే ట్రాక్ పక్కన ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు వివరాల మేరకు.. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా ఎలాంటి వివరాలు లభించలేదన్నారు. మృతుడు అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు జర్కిన్, తెలుపురంగు ట్రాక్ ప్యాంట్‌తోపాటు కుడి చేతి పై లక్ష్మీనరసింహ స్వామి, ఓం నమో నరసింహా నమః, ఎడమ చేతిపై అభిరామ్ అని పచ్చబొట్టు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

సీపీజీఈటీ ఎంట్రెన్స్ ఫలితాలు విడుదల

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన కామన్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంటెన్స్ ఫలితాలను సోమవారం విడుదల చేశారు. దీంతో పాటు రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్, ఫస్ట్ ఫేజ్ షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 10 నుంచి 15వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలనీ సూచించారు. ఈ నెల 18 నుంచి 20 వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఓయూ వెబ్ సైట్‌ను చూడాలని అధికారులు పేర్కొన్నారు.

పేరుకుపోయిన చెత్తను తరలించాలి



చెత్తను పరిశీలిస్తున్న నాయకులు

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో నెలరోజులుగా పేరుకుపోయిన చెత్తను తక్షణమే తరలించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన హమాలీ యూనియన్ సభ్యులతో కలిసి మార్కెట్ యార్డులో సందర్శించారు. నెల రోజులుగా చెత్తను తరలించకపోవడంతో దుర్గంధంగా మారిందని హమాలీలు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా నర్సింహా మాట్లాడుతూ.. చెత్తను తరలించే విషయంలో మార్కెట్ అధికారులు, పాలక మండలి నిర్లక్ష్యమే కారణమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను తరలించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్య, గట్టయ్య, రాజు, మహేందర్, లింగం, రాజయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

యూపీఏ, ఎన్‌డీఏకు ప్రత్యామ్నాయం బీబీఏ



మాట్లాడుతున్న డా. భగవాన్ గవాయ్

లాలాపేట: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ భీమ్‌రావ్ అంబేడ్కర్)ను రానున్న రోజుల్లో తెలంగాణలో అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా దళిత బహుజనులను ఏకం చేస్తామని భారతీయ సమాజ్ సంఘ్ జాతీయ కన్వీనర్, బొంబాయి దళిత బిలియనైర్ డాక్టర్ భగవాన్ గవాయ్ అన్నారు. సోమవారం తార్నాకలోని ఆర్‌పీఐ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయిలోని యూపీఏ, ఎన్‌డీఏ కూటమిలకు ప్రత్యామ్నాయంగా 30 పార్టీలతో కలిసి భారతీయ బహుజన్ అలయన్స్) బీబీఏను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బహుజనులు శక్తివంతంగా తయారు కావడానికి లార్డ్ బుద్ధా బ్యాంక్‌ను హైదరాబాద్‌లో త్వరలో ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎండీ ముజీర్, చంద్రకాంత్, గాలి వినోద్‌కుమార్, గవ్వల శ్రీకాంత్, సయ్యద్ హుస్సేనీ, బుద్ధిస్టు వింగ్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ చింతూరె పాల్గొన్నారు.

తెగిన ప్రజా సీసీ కెమెరాల కేబుళ్లు

ఇన్‌స్పెక్టర్ చొరవతో మరమ్మతు



తెగిన సీసీ కెమెరాల కేబుల్లను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ అనుదీప్

చిలకలగూడ: గణనాథుడి శోభాయాత్రతో పాటు వివిధ కారణాలతో చిలకలగూడ ఠాణా పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజా సీసీ కెమెరాల కేబుల్ వైర్లు తెగిపోయాయి. ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు ఠాణాలోని సెంట్రల్ కమెండ్ సెంటర్‌కు అనుసంధానం కాలేదు. తక్షణమే స్పందించిన చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ రంగంలోకి దిగారు. ఆయా ప్రాంతాలను సందర్శించి తెగిపడిన ప్రజా సీసీ కెమెరాల కేబుళ్లను గుర్తించి అక్కడికక్కడే మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఫుటేజీలతో నేరాలను నియంత్రించవచ్చన్నారు. సమస్య ఉత్పన్నమైన వెంటనే పరిష్కారానికి కృషి చేసిన చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌ను ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ శశాంక్‌రెడ్డి అభినందించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



గుర్తుతెలియని మహిళ మృతదేహం

గాంధీఆస్పత్రి: చికిత్స పొందుతున్న గుర్తు తెలియని ఓ మహిళ మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల1న గాంధీ జనరల్ మెడిసిన్ ఏఎంసీ వార్డులో సమీనాబేగం (40) అనే మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని అక్కడే వదిలేసి కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు. కేస్‌షీట్‌లో మెదక్‌జిల్లా నర్సాపూర్, రతన్ నాయక్‌పల్లి అని ఉంది. అక్కడి పోలీసులు, గ్రామస్తులను వాకాబు చేయగా సమీనబేగం పేరుతో ఎవరూ లేరని, ఫొటో కూడా గుర్తు పట్టలేమని చెప్పడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.



ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక చర్యలు



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సికింద్రాబాద్: రైల్వే ప్రయాణికుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్‌గౌడ్, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బీఎస్ సారస్వత్ తెలిపారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పలువురు అనుమానాస్పద వ్యక్తులకు అదుపులోకి తీసుకోవడంతో పాటు, దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది జరిగిన 34 చోరీ కేసుల్లో రూ.18.20 లక్షల విలువైన సొత్తును రికవరీ చేశామన్నారు. అనుమానితుల సంచారాలను కట్టడి చేయడం, తద్వారా రైల్వేస్టేషన్‌లో నేరాలను నియంత్రించడం కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

12న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్‌మేళా

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో, మెడ్ ప్లస్ ఫార్మసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12న ఓయూలో ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు బ్యూరో డిప్యూటీ చీఫ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆర్ట్స్ కళాశాల ఎదుట ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో జాబ్‌మేళా జరుగుతుందని అపోలో ఫార్మసీ ఫార్మాసిస్టులు, అసిస్టెంట్ ఫార్మాసిస్ట్‌లకు చెందిన దాదాపు 100 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. డీ–ఫార్మసీ, బీ–ఫార్మసీ, ఎం ఫార్మసీ, డిగ్రీ చేసిన 18 ఏళ్ల నుంచి 35 సంవత్సరాల యువతీ యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరవ్వాలన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

సనత్‌నగర్: ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమ అన్నారు. బేగంపేట పాటిగడ్డలో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం ఆమె అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్క హామీని అమలు చేస్తుందన్నారు.

బాలికను రక్షించిన పోలీసులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహారాష్ట్ర చంద్రపూర్‌కు చెందిన మహిళను రక్షించిన ఆర్‌పీఎఫ్ పోలీసులు సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మహారాష్ట్రకు చెందిన మహిళ వ్యక్తిగత సమస్యల కారణంతో ఇంట్లో చెప్పకుండా ఆదివారం సికింద్రాబాద్‌కు చేరుకుంది. తనువు చాలించాలని నిర్ణయించుకుని సికింద్రాబాద్–హైదరాబాద్ వైపున్న రైల్వే ట్రాక్ సమీపంలో అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా అక్కడే విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ ఎం .వెంకటరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ గుర్తించి అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఇంజనీరింగ్ కాలేజీ- ఏఐఎల్ ఐఎన్‌సీ టెక్నాలజీస్ ఒప్పందం

లాలాపేట: సాంకేతిక ఆధారిత విద్యను ముందుకు తీసుకెళ్లేందుకు ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ఏఐ ఎల్ఐఎన్‌సీ టెక్నాలజీస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సోమవారం ఓయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఇరువురు అధికారులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో విద్యార్థులకు కృత్రిమ మేధస్సు(ఏఐ), మెషీన్ లర్నింగ్(ఎంఎల్), డెటా అనలిటిక్స్ రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించబడుతాయన్నారు. ఓయూ వీసీ నాయకత్వంలో విద్యార్థులు అత్యాధునికమైన నైపుణ్యాలతో పరిశ్రమలకు కావాల్సిన నిపుణులను తయారు చేయడమే దీని ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ మంగు, ప్రొ. మల్లేశం, ఏఐ ఎల్ఐఎన్‌సీ టెక్నాలజీస్ డైరెక్టర్ సందీప్ హోలాం, శుభంలాల్, పూర్వ శ్రీవాత్సవ, ప్రొ. ఎల్. శివరామకృష్ణ,ప్రొ. డి రామకృష్ణ, డి. దివాకర్ పాల్గొన్నారు.

రాంచందర్‌రావు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

లాలాపేట: యూనివర్సిటీల్లో కాంట్రాక్టు అధ్యాపకులను నియమించడం సరైందికాదని కాంట్రాక్టు అధ్యాపక నియామకాలు రద్దు చేసి శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల కాంట్రాక్టు అధ్యాపకులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఈ మేరకు సోమవారం తెలంగాణ యూనివర్సిటీల కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ ఓ పత్రికా ప్రకటనను విడుదల చేసింది. దాదాపు 30 సంవత్సరాల క్రితం ఏర్పడిన ఖాళీల్లో తామంతా నియమింపడి యూనివర్సిటీల మనుగడను కాపాడుతున్నామన్నారు. ప్రస్తుతం అన్ని విశ్వవిద్యాలయాల్లో 60 నుంచి 80 శాతం కాంట్రాక్టు అధ్యాపకుల ద్వారానే నిర్వహణ కొనసాగుతుందన్నారు. ఈ నేపథ్యంలో రాంచందర్‌రావు చేసిన వ్యాఖ్యలు కాంట్రాక్టు అధ్యాపకుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. గతంలో తమ న్యాయమైన పోరాటాలకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారని గుర్తు చేశారు.